పరిహారం.. పరిహాసం

- పాలకుల మాటలు నీటిమీద రాతలాయే!
- రూపాయి చెల్లించకుండానే 167 విస్తరణ..
- మిగిలిన జాగాలో నిర్మాణం చేస్తే నోటీసులు
- అధికారులను ఆశ్రయిస్తున్న బాధితులు



జడ్చర్ల పట్టణంలో ఇళ్లు కోల్పోయిన ప్రాంతం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల పట్టణంలో 167వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో చాలా మంది తమ ఇళ్లను, స్థలాలను కోల్పోయారు. పరిహారం ఇస్తామని నమ్మబలికి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. చివరకు బాధితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా జారుకున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితులు బుధవారం జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నాలుగేళ్లు గడిచింది. ఇప్పుడు పరిహారం అంశం తెరపైకి రావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కోదాడ – ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే 167వ నెంబరు జాతీయ రహదారి జడ్చర్ల మీదుగా వెళ్తోంది. మున్సిపాలిటీ పరిధిలోని 8, 10, 26, 12, 3వ వార్డుల్లో ఈ రహదారి వెళ్తోంది. ఇందుకోసం రోడ్డు కిరువైపులా ఉన్న ఇళ్లను తొలగించాల్సి వచ్చింది. 10, 26వ వార్డుల్లో నష్టం అధికంగా జరిగింది. రోడ్డు విస్తరణ సమయంలో ఇండ్లు కోల్పోతున్న వారికి అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి డబుల్‌బెడ్రూంలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రోడ్డు పోగా మిగిలిన కొద్దిపాటి జాగాలో నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బాధితులు తమ ఇళ్లను అప్పగించారు. రోడ్డు విస్తరణ సమయంలో ఒక్కోచోట ఒక్కోలా నిర్మాణం చేశారు. కొన్నిచోట్ల 50అడుగులు మరికొన్ని చోట్ల 40అడుగులు, ఇంకొన్ని చోట్ల 36 అడుగులు మాత్రమే విస్తరణ వేశారు.

1998లోనూ విస్తరణ...

1998లో సింగల్‌రోడ్డును డబుల్‌రోడ్డుగా విస్తరించే క్రమంలో ఇదే ప్రాంతంలో 6మంది ఇళ్లు కోల్పోయారు. వారికి ప్రభుత్వ ఇంటిస్థలం ఇస్తామని పట్టాలు ఇచ్చినప్పటికీ జాగా చూయించలేదు. ఆ తరువాత 2018లో మరోసారి రోడ్డు విస్తరణ కోసం దాదాపు 40మంది ఇళ్లు 90శాతం నుంచి 100శాతం కోల్పోయారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ప్రస్తుత విస్తరణ నేపథ్యం..

రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నాలుగేళ్లు అవుతున్న తరుణంలో పరిహారం కోసం బాధితులు ఇప్పుడు వినతిపత్రం సమర్పించారు. రోడ్డు వేసిన తరువాత మజీద్ ఎదురుగా ఇళ్లు కోల్పోయిన వారికి 10అడుగుల జాగా మిగిలింది. దానికి అనుసరించి మరో వ్యక్తి జాగా కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేశాడు. అయితే నిర్మాణం సందర్భంగా రోడ్డువైపు షట్టర్లు వేశాడు. దీంతో 10అడుగుల జాగా ఉన్న వారు షట్టర్ల నిర్మాణంకోసం ప్రయత్నించగా వివాదం మొదలైంది. కోల్పోయిన జాగా అంతా జాతీయ రహదారికి సంబంధించినదని వాదనలు మొదలయ్యాయి. తమకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా ఎన్‌హెచ్ వారిది స్థలం ఎలా అవుతుందని బాధితులు వాదిస్తున్నారు. ఈక్రమంలో 10అడుగుల జాగాలో నిర్మాణం చేసిన బాధితులకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పరిహారం ఇవ్వలేదని చెప్పినా వినకుండా, అనుమతి లేకుండా నిర్మాణం చేశారంటూ 2వ నోటీసు జారీ చేశారు. దీంతో బాధితులు అదనపు కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. పరిహారం ఇవ్వకుండా ఉన్న జాగాలో కట్టుకుంటే నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో రోడ్డుపై ఇళ్లు కోల్పోయిన వారంతా ఏకమయ్యారు. తమను నమ్మించి విస్తరణ చేశారని, పరిహారం ఇవ్వాలని పోరాటానికి సిద్ధమయ్యారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల డీటీ మహబూబ్‌అలీకి వినతిపత్రం సమర్పించారు. తమకు ఇళ్లకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పరిహారం ఇయ్యలేదు..



రోడ్డు విస్తరణ కోసం ఇళ్లు పోతున్నందుకు పరిహారం ఇస్తా మన్నారు. ఉన్న జాగాలో కట్టుకుని ఉండవచ్చని నచ్చచెప్పింగ్రు. డబుల్‌బెడ్రూం ఇస్తామని చెప్పింగ్రు. రోడ్డుకోసం పోగా నా ఇళ్లు ఒక్కరూం మిగిలింది. దానిపైనే ఇంకో రూం కట్టుకుని ఉంటున్నాం. ఇస్తమన్న పరిహారం లేదు డబుల్ బెడ్రూం ఇవ్వలేదు. ఇప్పటికైనా మా గోడు విని న్యాయం చేయండి.

– శ్రీనివాసులు, జడ్చర్ల

రెండుసార్లు తీవ్రంగా నష్టపోయాం..



1998లో ఒకసారి, 2018లో మరోసారి రెండుసార్లు రోడ్డు కోసం ఇళ్లు పూర్తిగా కోల్పోయి తీవ్రంగా నష్టపోయాం. 1998లో ఇంటికోసం జాగా ఇస్తమని ఇయ్యలేదు. ఇప్పుడేమో డబుల్‌బెడ్రూం కట్టిస్తమని అదీ ఇయ్యలేదు. రోడ్డుమీద ఉన్న ఇళ్లు పూర్తిగా కోల్పోయి మేం రోడ్డున పడ్డాం. మా గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పరిహారం ఇచ్చి డబుల్‌బెడ్రూం ఇచ్చి ఆదుకోవాలి.

– రమేష్, జడ్చర్ల

క్లుప్తంగా

సాలార్‌నగర్‌లో సర్వే ప్రారంభం



గండేడ్: భూ భారతి అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా సాలార్‌నగర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలో అధికారులు పర్యటించారు. ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ సర్వే ఏడీ కిషన్‌రావు, డీటీ మాధవి గ్రామానికి చేరుకున్నారు. ముందుగా గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో ఉన్న భూమి వ్యవసాయ భూమికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన మ్యాపును పరిశీలించారు. ఇందులో ఏఏ భూమి ఎంతెంత ఉందన్న విషయాలు పరిశీలించారు. గురువారం నుంచి అన్ని భూములు సర్వే చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యాసిన్, తదితరులు ఉన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన



మిడ్జిల్: నూతనంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు దారులను గుర్తించుటకు బుధవారం మండలంలోని వల్లభ్‌రావుపల్లి గ్రామంలో తహసీల్దార్ రాజు ఇంటింటి తిరిగి అర్హులను పరిశీలించారు. అర్హులందరికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. ఇంటింటికి తిరిగి దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది అంబిక, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బండ్రవల్లి యువకుడికి డాక్టరేట్

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి జానకిరాములుకు డాక్టరేట్ వచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్ర విభాగంలో ఎసోషియో, ఎకనామిక్ ఎనాలసిస్ ఆఫ్ ఫార్మర్స్ సూసైడ్స్ ఇన్ తెలంగాణ అంశంపై పూర్తి విశ్లేషణ చేసినందుకు గాను ఉస్మానియ విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, బీఓఎస్ ప్రొఫెసర్ రాములు చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు. జానకిరాములుకు డాక్టరేట్ లభించడంతో మండలంలోని విద్యాభిమానులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ బండారోత్సవాలు



మరికల్: మండలంలోని మాధవరం గ్రామంలో బుధవారం ఎల్లమ్మ బండారోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కుర్వ కులస్థులు ఐదేళ్లకు ఒకసారి నిర్వహించుకున్నే బండారు ఉత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి కాకుండానే ఇతర పట్టణాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎల్లమ్మ ఆలయం అవరణలో ఏర్పాటు చేసిన పసుపు బండారు ఉత్సవాల్లో ఒకరిపై ఒకరు బండారు చల్లుకున్నారు.

పకడ్బందీగా భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ విజయేందిర బోయి



పోల్కంపల్లి రెవెన్యూ గ్రామసభలో సమస్యలు వింటున్న కలెక్టర్ విజయేందిర బోయి

అడ్డాకుల: ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. భూ భారతి చట్టం అమలు కోసం జిల్లాలో మూసాపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా పోల్కంపల్లి, సంకలమద్ది గ్రామాల రెవెన్యూ గ్రామ సభలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ సభల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో భూముల సమస్యలపై వచ్చిన ఆర్జీలను పరిశీలించారు. భూ సమస్యలపై ఆర్జీలు తెచ్చిన దరఖాస్తు దారులతో కలెక్టర్ మాట్లాడారు. భూ భారతి చట్టంలో పొందుపర్చిన అంశాలపై ప్రజలకు వివరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు అందజేసిన వారు తప్పకుండా వాటికి సంబంధించిన అన్ని రికార్డుల పత్రాలను కూడా అందజేస్తే విచారణలో అధికారులు సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోల్కంపల్లిలో 38, సంకలమద్దిలో 32 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, తహసీల్దార్లు రాజు నాయక్, మదన్‌మోహన్‌గౌడ్, గిర్దావర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతంగా ఎదగాలి



కార్యక్రమంలో డాన్స్ చేస్తున్న పీయూ విద్యార్థినులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని పీయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచంలో పేరెన్నికగన్న సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో సీఈఓలుగా చేసే వారందరూ చదువుతో పాటు స్కిల్స్‌ను కూడా డెవలప్ చేసుకున్నారని, అందువల్ల ఉన్నతంగా ఎదిగారన్నారు. ప్రతి విద్యార్థి కూడా స్టార్టప్ కంపెనీలు పెట్టి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి రావాలన్నారు. కార్యక్రమంలో జావేద్‌ఖాన్, అర్జున్‌కుమార్, నాగసుధ, అరుంధతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూహెచ్ వీసీని కలిసిన పీయూ వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేఎన్టీయూహెచ్ వీసీ కిషన్‌కుమార్‌రెడ్డిని పాలమూరు యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ శ్రీనివాస్ హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వనపర్తి పీజీ సెంటర్‌లో ల్యాబ్ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.

రేకుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం దిగుడు మెట్లపై దాతల సహకారంతో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టేందుకు బుధవారం ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ఇప్పటికే దాతల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే ఆలయ దిగుడు మెట్లపై 300 ఫీట్లరేకుల షెడ్డు నిర్మాణానికి దాతలు మరికల్ మండల కేంద్రానికి చెందిన రాజవర్ధన్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ముక్కెర మధుసూదన్‌లు ముందుకు వచ్చారన్నారు. ఆలయ అభివృద్ధికి ఇంకా దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు భాస్కరాచారి, వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

‘ఆపరేషన్ సింధూర్'కు మద్దతుగా సంబరాలు



మాగనూర్(మక్తల్): పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా బుధవారం తెల్లవారుజామున భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో పాటు పీఓకేలోని 9 ఉగ్ర స్థావరాలపై భారత వాయుసేన దళాలు దాడి చేసి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి ఉగ్రమూకలను తుద ముట్టించడాన్ని స్వాగతిస్తున్నామని మక్తల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న దానిని అంతం చేయాల్సిందేనని, ఉగ్రవాద నిర్మూలనలో ప్రభుత్వానికి వంద శాతం తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు జాతీయ జెండా చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌక్‌లో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో జరిగే తగాదాలు, చోరీలను అరికట్టవచ్చని ఎస్ఐ సురేష్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయా కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నిలువరించే అవకాశం ఉందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా విరాళాలు అందించి వేగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాని కోరారు.

ఘనంగా వాసవీమాత జయంతి



జడ్చర్లలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

జడ్చర్ల టౌన్: వాసవికన్యకాపరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని జడ్చర్లలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో రెండు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రెండోరోజు అమ్మవారికి వసంతోత్సవం, నిజాభిషేకం, నవవిధ ఫల అభిషేకం, పుష్పార్చన, డోలాహరణం, సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి అమ్మవారి శోభాయాత్ర కన్నుల పండుగలా సాగింది. వేడుకల్లో పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు. సకలదేవతల ఆలయంలోని వాసవి కన్యకాపరమేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు.

దుస్తుల పంపిణీ

వాసవీమాత జయంతిని పురస్కరించుకుని వాసవీ క్లబ్, వాసవీ వనితక్లబ్ సంయుక్తంగా దుస్తుల పంపిణీ చేశారు. పేద మహిళలకు చీరలు అందజేశారు.

108 కలశాల జలంతో అభిషేకం

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో బుధవారం అమ్మవారి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



దేవరకద్రలో సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

ఈ సందర్భంగా వాసవీమాతను పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు 108 కలశాలతో తెచ్చిన జలంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం నింపే కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, దీపోత్సవం నిర్వహించి అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాలలో పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ఆరాధన మహోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో స్వామివారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రెండురోజుల పాటు నిర్వహించిన భజన పోటీల్లో వీరాంజనేయ భజన మండలి (గురుకుంట) ప్రథమ, శివాంజనేయ స్వామి భజన మండలి (కొండాపూర్) ద్వితీయ, శివరామాంజనేయ భజన మండలి (బోయపల్లి) తృతీయ స్థానాల్లో నిలవగా శివరామాంజనేయ భజన మండలి (ఇబ్రహీంబాద్), తిరుమలనాథ భజన మండలి (గొండ్యాల), శ్రీమారుతి భజన మండలి (జడ్చర్ల), శ్రీశివాంజనేయస్వామి భజన మండలి (దొడ్డలోనిపల్లి-మహబూబ్‌నగర్) ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. ఉత్తమ గాయకుడు జి.నారాయణ (అమిస్తాపూర్),



ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉత్తమ తబలిస్ట్ ఉపేందర్ (గార్లపాడ్), ఉత్తమ హార్మోనియంగా యాదయ్య (పోమాల్) నిలిచారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో శేఖరాచారి, వి.నారాయణ, రాఘవాచారి, నారాయణ, మల్లికార్జున్, రమేష్, రఘు, శ్రీనివాస్, సత్యనారాయణ కృష్ణమాచారి, విశ్వనాథాచారి, నర్సింహాచారి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి భవనంలో బుధవారం సాయంత్రం మహబూబ్‌నగర్ ప్రెస్‌క్లబ్ కొత్త కార్యవర్గంతో ఎన్నికల అధికారి, న్యాయవాది బెక్కం జనార్దన్ ప్రమాణ స్వీకారం చేయించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ ఘన విజయం సాధించిన విషయం విదితమే. కాగా, ప్రమాణ స్వీకారం చేసిన వారిలో అధ్యక్షుడు నరేంద్రచారి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌గౌడ్, కోశాధికారి పల్లెమోని యాదయ్య, ఉపాధ్యక్షులు చింతకాయల వెంకటేష్, అక్కల ధరణీకాంత్, అంజిలయ్య, సంయుక్త కార్యదర్శులు మణిప్రసాద్, పుట్టపాగ సతీష్‌కుమార్, కృష్ణ ఉన్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మోహన్‌దాస్, రాంకొండ, జి.రవికుమార్, కె.వెంకట్రాములు, అబ్దుల్ అహ్మద్ సిద్దీఖీ, షాబుద్దీన్ ముల్లా ప్రమాణ



ప్రెస్‌క్లబ్ కొత్త కార్యవర్గంతో ఎన్నికల అధికారి బెక్కం జనార్దన్

స్వీకా రం చేశారు. అనంతరం ఎన్నికల అధికారి బెక్కం జనార్దన్ మాట్లాడుతూ ఈ రెండేళ్ల కాలంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. అందరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కొత్త కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన



వస్పులలో ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మిడ్జిల్: ఆయిల్ పాం సాగుపై బుధవారం మండల పరిధిలోని వస్పుల గ్రామంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులు పంట సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగం, ఎరువుల వాడకంపై తగిన సూచనలు చేశారు. మూడు సంవత్సరాలు దాటిన తర్వా త పంట చేతికొస్తుందని, ఆయిల్ పాం సాగుకు ప్ర భుత్వం ఇస్తున్న రాయితీల గురించి వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 4400 ఎకరాలలో ఆయిల్ పాం తోటలు సాగు చేసినట్లు జడ్చర్ల క్లస్టర్ ఉద్యాన వనశాఖ అధికారి మహేందర్ వివరించారు. ఈ సంవత్సరం 1500 ఎకరాలలో ఆయిల్ పాం తోటలను సాగు చేయాలని లక్ష్యం ఉందని, ఆసక్తి ఉన్న రైతులు తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు మమత, కృష్ణారెడ్డి, రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రేణయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసు



మహబూబ్‌నగర్‌లో సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పాలమూరు: ఈనెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెపై జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడారు. ఈనెల 20న దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దేవరకద్ర: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండలంలోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20 సమ్మెలో పాల్గొంటున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు వేణుగోపాల్, కార్మిక సంఘాల నాయకులు బుధవారం తహసీల్దార్ కృష్ణయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ సమ్మెను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపాఉ. వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 4 లేబర్ కోడ్‌లను కేంద్రం ప్రభుత్వం అమలులోకి తెస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ల రద్దు కోసం జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వేసవి శిబిరాలతో మానసికోల్లాసం



దివిటిపల్లిలో సమ్మర్ క్యాంపులో మాట్లాడుతున్న పీబీజీ ట్రస్ట్ చైర్మన్ రాంరెడ్డి



మిడ్జిల్‌లో సమ్మర్ క్యాంపులో చెస్ ఆడుతున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్: వేసవి శిబిరాలతో పిల్లల్లో మానసికోల్లాసం, ఫలితంగా జీవన ప్రమాణ స్థాయి పెరుగుతుందని పీబీజీ ట్రస్ట్ చైర్మన్ ఆర్ రాంరెడ్డి పేర్కొన్నారు. పి.బాలకృష్ణయ్యగౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో బుధవారం ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకే వేసవిలో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వేసవి శిబిరాల్లో వివిధ అంశాలలో శిక్షణ ఇస్తున్నామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిల్లె గోపాల్, కడియాల మోహన్, నల్లవెల్లి కురుమూర్తి, ఎం.కుర్మయ్య, రవికుమార్, వెంకటేష్, కథలయ్య, హేమంత్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం సమ్మర్ క్యాంపును ఎంఈఓ వెంకటయ్య ప్రారంభించారు. క్యాంపులో వాలీబాల్, క్యారమ్స్, చెస్, ఇతర క్రీడలను కూడా నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి, అయ్యవారిపల్లి జీహెచ్ఎం సుధాకర్, పీడీ రాజశేఖర్, నర్సింహ పాల్గొన్నారు.